
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 4 । అక్టోబర్ । 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం నాటికి 28.692 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ నుంచి 4,100 క్యూసెక్కుల వంతున వరద కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.58,520
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,272
3శాతం జీఎస్టీతో	రూ.5,430
నవర (8గ్రా)	రూ.43,440

గరిష్టం/కనిష్టం
37.1 /28.3

వాతావరణం

మంగళవారం వాతావరణంలో తేమ 55శాతం ఉంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం వేడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టాం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టామని కలెక్టర్ ఎం హరినారాయణన్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. మంగళవారం ఉదయం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరై జిల్లాలోని పరిస్థితిని వివరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ జిల్లాలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. 6.01.2022 నుంచి ఓటర్ల సవరణ, తొలగింపునకు వచ్చిన అన్ని దరఖాస్తుల పరిశీలన, రీ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తిచేశామని వివరించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమీక్షిస్తున్నామని, వారి సూచనలను స్వీక రించడంతో పాటు సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగసముద్రంలో 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాసమస్యల పరిష్కారానికి లింగసముద్రం మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

95.95 శాతం పింఛన్ల పంపిణీ



పడుగుపాడులో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గోద నీలిమ

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం మూడోరోజు 95.95 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు నగదు పంపిణీ చేశారు. జిల్లాలో 3,17,722 మంది లబ్ధిదారులకు నగదు అందజేయాల్సి ఉండగా, 3,04,862 మందికి పంపిణీ చేశారు. ఈ నెల 5వ తేదీ వరకు పింఛన్ కానుక నగదు పంపిణీ చేయనున్నారు.

10న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 10న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి జరిగే స్థాయీ సంఘాల సమావేశాలకు జెడ్పీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కండలేరులో 11.748 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 11.748 టీఎంసీలు ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి 50 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిజ్‌కు 15 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పచ్చకుట్ర

ప్రజాభిమానాన్ని కోల్పోయిన పచ్చపార్టీ నేతలు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో కుట్రలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే లక్ష్యంగా వారి ఓట్ల తొలగింపునకు ఆన్‌లైన్‌లో ఫారం–7లు దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలోని సర్వేపల్లి, నెల్లూరు నగర నియోజకవర్గాల్లో ఈ విధమైన కుట్రలకు పాల్పడడంతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మండిపడుతున్నారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా..

- టీడీపీ కీలక నేతల కనుసన్నల్లో ఆన్‌లైన్‌లో ఫారం–7 దాఖలు
- నిన్న సర్వేపల్లి, నేడు నెల్లూరు నగరం
- రెండు నియోజకవర్గాల్లో 15వేల ఓట్ల తొలగింపునకు కుట్ర
- పచ్చకుట్రపై వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల మండిపాటు
- పోలీసులకు ఫిర్యాదు



కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'అధికార పార్టీ నేతలు ప్రతిపక్ష పార్టీ మద్దతుదారుల ఓట్లు తొలగింపునకు కుట్రలు పన్నారు. టీడీపీ ఓట్లను టార్గెట్ చేసి వారికి తెలియకుండానే ఫారం–7 ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. ప్రతి ఓటు వెరిఫికేషన్ చేయాలి' అంటూ గతంలో టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి నానా హడావుడి చేశారు. దొంగ పట్టుబడే ముందు అడుగో దొంగ పారిపోతున్నాడంటూ తప్పించుకునే ప్రయత్నం చేయడం చూస్తుంటాం. అదే తరహాలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించే కుట్రలు పన్నుతూ ఆ నెపం అధికార పార్టీపై వేసేందుకు ప్రయత్నిస్తున్నారు టీడీపీ నేతలు. వారి నీచ సంస్కృతిని జిల్లా ప్రజలు ఛీదరించుకుంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి గడువులోపు చేర్పులు (ఫారం–6)కు 63,922 దరఖాస్తులు అందగా, 36,894 దరఖాస్తులను ఆమోదించారు. మరో 5,272 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇంకా 21,756 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే తొలగింపునకు (ఫారం–7) కు 1,20,697 దరఖాస్తులు అందగా, 55,903 దరఖాస్తులు ఆమోదించారు. మరో 7350 దరఖాస్తులు తిరస్కరణకు గురవగా, 57444 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే సవరణలకు సంబంధించి (ఫారం–8కు 1,80,712 దరఖాస్తులు అందగా, 1,30,091 దరఖాస్తులు మోదం పొందాయి. మరో 2,554 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇంకా 48,067 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పోలీసులకు ఫిర్యాదు..

నగరంలో జరిగిన పచ్చనేతల కుట్ర కోణంపై ఓ మహిళా ఓటరు నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాము స్థానికంగా ఉన్నప్పటికీ మమ్మల్ని చనిపోయినట్లుగా చూపి స్థానిక టీడీపీ నేతలు తమ ఓట్లు తొలగింపునకు ఫారం–7 దాఖలు చేశారని, వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం కలకలం రేపింది..

కుట్ర ఇలా..

- సర్వేపల్లిలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి తన అనుచరుల చేత 11,291 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఓట్ల తొలగింపునకు ఫారం–7ను ఆన్‌లైన్‌లో దాఖలు చేయించారు. వాటి వెరిఫికేషన్ సమయంలో అందరూ అర్హత ఉన్న వారిగా తేలింది. దీంతో అనుమానం వచ్చి పరిశీలిస్తే దాదాపు 11వేల ఓట్ల తొలగింపునకు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది.
- తాజాగా నెల్లూరు నగరంలోనూ ఇదే తరహాలో దాదాపు 5వేల ఓట్ల తొలగింపునకు మాజీ మంత్రి నారాయణ టీం కసరత్తు చేసింది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు సంబంధించిన ఓట్ల తొలగింపునకు ఆన్‌లైన్‌లో ఫారం–7 నమోదు చేశారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి సంబంధిత ఓటర్లకు సమాచారం వెళ్లడంతో వారు లబోదిబోమంటూ తాము బతికే ఉన్నామంటూ వెరిఫికేషన్ అధికారులకు మొరపెట్టుకున్నారు. నగర నియోజకవర్గ పరిధిలోని జనార్దన్‌రెడ్డి కాలనీలోని పోలింగ్ బూత్–10లో ఓటరుగా ఉన్న గౌస్‌బాషా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కావడంతో అతను చనిపోయినట్లుగా ఫారం–7 దరఖాస్తు చేశారు. పోలింగ్ బూత్ నంబర్ 9లో ఓటర్లుగా ఉన్న ఎస్ మస్తాన్, పెళ్లగిరి దేవయానం కూడా చనిపోయినట్లుగా ఫారం–7 దరఖాస్తు చేశారు.
- ఇదే తరహాలో జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ టీడీపీ నేతలు చేసి ఉండవచ్చనే కోణంలో అధికార పార్టీ నేతలు ఆరా తీస్తున్నారు. ఫారం–7 వెరిఫికేషన్‌పై దృష్టి పెడుతున్నారు. ప్రతిఓటు వెరిఫికేషన్ చేస్తున్నారు.

అర్హులకు అన్యాయం జరగకుండా..

టీడీపీ నేతల కుట్రకోణం వెలుగులోకి రావడంతో కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరి ఓటు పోకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేయడమే కాకుండా రీ వెరిఫికేషన్‌ను తానే స్వయంగా తనిఖీ చేశారు. దీంతో బీఎల్వోలు ఇంటింటి సర్వే పారదర్శకంగా చేపడుతుండడంతో కొంత మేర జాప్యం జరుగుతోంది.

షెడ్యూల్లో మార్పు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు ఈ ఏడాది జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టారు. జిల్లాలోని 2,303 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓట్ల చేర్పులు, మార్పులు, తొలగింపులపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెలలో ముసాయిదా జాబితా ప్రదర్శిస్తామని అధికారులు ప్రకటించారు. కానీ ఎన్నికల కమిషన్ షెడ్యూల్లో మార్పులు చేసింది. ముందుగా నిర్ణయించిన అక్టోబర్ 17న ముసాయిదాను ప్రచురించి నవంబర్ 30 వరకు అభ్యంతరాలు తీసుకోవాలని నిర్ణయించింది. తాజాగా అక్టోబర్ 27న ముసాయిదా ప్రచురించి డిసెంబర్ 26లోగా అభ్యంతరాలను పరిష్కరించనున్నారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితా ఆధారంగా సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

నేను చనిపోయినట్లుగా చూపారు

నేను జనార్దన్‌రెడ్డి కాలనీలో ఉంటాను. నా ఇంటి నంబర్ 28/8/799. పదో పోలింగ్ బూత్ పరిధిలో నాకు ఓటు ఉంది. కానీ నాకు తెలియకుండానే స్థానిక టీడీపీ నేతలు నా ఓటును తొలగించాలని ఫారం–7ను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సదరు విషయం తెలుసుకుని అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

–డీ సమీరా, జనార్దన్‌రెడ్డికాలనీ, నెల్లూరు

మర్యాదపూర్వకంగా...



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎంపీలు వేమిరెడ్డి, ఆదాల, మేయర్ పొట్లూరి స్రవంతి, జయవర్ధన్ దంపతులు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (దర్గామిట్ట): తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి దంపతులు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వరకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంట ఉన్న మేయర్ పొట్లూరి స్రవంతి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ నేపథ్యంలో సీఎంను మేయర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మేయర్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని సీఎం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను జిల్లా నేతలు కోరగా సానుకూలంగా స్పందించారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి కాకాణి పరిశీలించారు. హెల్ప్ డెస్క్, స్పాట్ రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్, మందుల పంపిణీ కౌంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు ఆనందాన్ని అందించాలనే గొప్ప సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. దివంగత సీఎం వైఎస్సార్ పేదలు ధనవంతుడితో సమానంగా వైద్యసేవలు పొందేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని రూపొందించారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీలో సుమారు మూడు వేలకు పైగా వ్యాధులను చేర్చి పేదవాడికి మరింత ఆరోగ్యభద్రత కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. ఆరోగ్యసురక్షలో భాగంగా ప్రతిఇంట్లోని కుటుంబ సభ్యులకు అవసరమైన ఏడు రకాల పరీక్షలు చేసి, వారి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ప్రజలకు ఏం అవసరమో ఆలోచన చేస్తూ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఎల్‌డీఓ వసుమతి, వైస్‌ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండలాధ్యక్షుడు కొణిదెల మోహన్‌నాయుడు, నాయకులు విజయభాస్కర్‌నాయుడు, కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, అడపాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



వేదాయపాళెంలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్

- జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ కొనసాగిన 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- 36 ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు
- వైద్యశిబిరాలకు విశేష స్పందన

నెల్లూరు(బారకాసు): వైద్యరంగంలో అపూర్వ ప్రయోగం..ముందుగానే అనారోగ్యానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం..ఆరోగ్యంపై అవగాహన ఉన్న, ఆర్థిక స్థోమత ఉన్న వారు సైతం ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారు..బాధ ఉంటేనే పట్టించుకుంటారు..లేకుంటే పర్వాలేదులే అని అలక్ష్యం చేస్తారు..కానీ జగనన్న ప్రభుత్వం ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటింటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేసి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోంది. స్పెషలిస్టు డాక్టర్లతో వైద్యసేవలను అందిస్తోంది. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ వైద్యం అందిస్తోంది. దీంతో జగనన్న ఆరోగ్య సురక్ష తమ వంటి వారికి శ్రీరామరక్ష అని సామాన్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. తొలిరోజు జిల్లాలోని 33 మండలాల్లో ఒక్కో శిబిరం చొప్పున మొత్తం 33 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రెండో రోజైన మంగళవారం జిల్లా వ్యాప్తంగా 36 వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. అందులో మండలాల్లో 33, నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో 3 శిబిరాలు నిర్వహించారు. రెండో రోజు ఓపీకి విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 14,637 మంది హాజరవగా వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 602 మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. మిగిలిన వారందరికీ అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు.

ఇంటి వద్దే వైద్యసేవలు..అద్భుతం



గతంలో ఏ ప్రభుత్వాలు ఇలా ఇళ్ల వద్దకొచ్చి పరీక్షలు చేసి ఆస్పత్రులకు తీసుకొచ్చిన దాఖలాలు లేవు. సీఎం వైఎస్ జగన్ గొప్ప మనసుతో మాలాంటి సామాన్యుల కోసం ఇంటి సమీపంలో క్యాంపులు నిర్వహించి సేవలందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– ప్రసన్నబాబు, కిసాన్‌నగర్, నెల్లూరు

జగనన్న మేలు మరువలేం..



ప్రైవేట్‌గా ఏ చికిత్స చేయించుకోవాలన్నా కనీసం రూ.2 వేలు ఖర్చవుతుంది. అటువంటిది ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మంచి మందులు అందిస్తున్నారు. మాలాంటి వారికి పైసా ఖర్చు లేకుండా చూస్తున్నారు. జగనన్న మేలు మరువలేం.

– మస్తానమ్మ, శ్రీనివాసనగర్, నెల్లూరు

రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం

- కమిషనర్ వికాస్‌మర్మత్

ప్రజారోగ్యం కోసం చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికిందని కమిషనర్ వికాస్‌మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో జనగన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను మంగళవారం ప్రారంభించారు. తొలిరోజు జాకీర్‌హుస్సేన్‌నగర్, రైతుబజార్‌రోడ్డు, వేదాయపాళెంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంపులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేదాయపాళెంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో అక్టోబరు 31 వరకు క్యాంపులు కొనసాగుతాయన్నారు. ప్రతిడివిజన్‌లో క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రోగులకు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారని వివరించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

చిట్టమూరు: మల్లాంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నుంచి స్వామి,అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేశారు. స్వామి వారి సన్నిధిలో ఒక్కటైతే శుభాలు కలుగుతాయనే నమ్మకంతో నూతన వధూవరులు వివాహాలు చేసుకున్నారు.

బాబు, పవన్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరు


మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ నమ్మరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడు పంచాయతీ పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ఏ ఇంటికి వెళ్లినా ప్రజల నుంచి విశేషాదరణ లభిస్తోందన్నారు. రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. నాలుగున్నరేళ్లలో ప్రజల ముఖాలు చూడని టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు.. ఎన్నికలు సమీపించడంతో రకరకాల వేషాలతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతుంటే వీరు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారన్నారు.

తప్పు చేశారు కాబట్టే అరెస్ట్

ప్రజల డబ్బు మింగేసి చంద్రబాబు తప్పు చేశాడని, దీనిపై సీఐడీ క్షుణ్ణంగా విచారించి తగిన ఆధారాలతోనే బాబును అరెస్ట్ చేసినట్లు ఎమ్మెల్యే ప్రసన్న చెప్పారు. అయితే ఆయనకు మద్దతుగా పవన్ నిలవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతిపరుడికి మద్దతు తెలపడం ఏమిటని నిలదీశారు. బాబు నుంచి పవన్‌కు సూట్‌కేసులు అందడంతోనే మమ్మల్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని దుయ్యబట్టారు. కాపులు సైతం పవన్ తీరును సమర్థించడం లేదన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రసన్నకుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.


గంధ మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా గంధ మహోత్సవం

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఈనెల 11న జరుగనున్న గంధ మహోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలంలోని బ్రహ్మణపల్లిలో ఉన్న ఎమ్మెల్యే మేకపాటి నివాసంలో దర్గా ఈఓ మహ్మద్ హుస్సేన్, ఏఎస్‌పేట వైఎస్సార్‌సీపీ నేత షేక్ జిలానీబాషా, ప్రజాప్రతినిధులతో కలిసి హజరత్ సయ్యద్ ఖాజానాయబ్ రసూల్ 250వ గంధమహోత్సవ పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు దర్గాలో నిర్వహించనున్న వివిధ ప్రార్థనల గురించి మైనారిటీ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌పేటలోని దర్గాలో జరిగే గంధ మహోత్సవానికి అనేక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని, వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసేందుకు ముందుగానే సమీక్షలు నిర్వహించుకుని ఎవరు ఏ పనులు చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, నీరు ట్రాఫిక్, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అంశాల పట్ల ముందుగానే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని తెలిపారు. దీనిపై త్వరలో అందరం సమీక్షలు నిర్వహించుకుని గంధ మహోత్సవాన్ని విజయవంతంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేద్దామని ఎమ్మెల్యే తెలియజేశారు. వారి వెంట వివిధ మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పెత్తందారులకే బాబు మద్దతు


మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్రంలో పెత్తందారుల ముఠాకే చంద్రబాబు, పవన్ మద్దతు ఉంటుందని, పేదల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలను అమలు చేసేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తిలో ఎమ్మెల్యే రామిరెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ద్వారా పేదలకు న్యాయం జరుగుతోందని, దీనివల్ల పెత్తందారీతనం లేకుండా పోయిందన్నారు. పేదలకు అత్యంత ముఖ్యమైన విద్య, వైద్యరంగాలను కార్పొరేట్‌కు దీటుగా సీఎం వైఎస్ జగన్ తీర్చిదిద్దినట్లు తెలియజేశారు. పేదలకు అన్నివిధాలా న్యాయం జరుగుతుండడంతో చంద్రబాబు నాయకత్వంలోని పెత్తందారులైన ఎల్లో మీడియా, పవన్ కల్యాణ్ ఓర్వలేకున్నారన్నారు. దీనివల్ల ఇష్టారాజ్యంగా ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. చంద్రబాబు చేసిన మోసాల వల్లే ఆయన అరెస్ట్ అయ్యాడని, దీనిని రాజకీయం చేయడం తగదన్నారు. స్కిల్ స్కామ్ కేసులో పూర్తి ఆధారాలు ఉన్నాయని, డేట్ లేని ఫేక్ ఎంఓయూ, ఫైల్‌పై చంద్రబాబు 13 సంతకాలు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. అవినీతి జరిగిందని పూర్తి ఆధారాలను బయటపెడుతున్నా.. స్కామ్‌తో బాబుకు సంబంధం లేదంటే ఎలా అని నిలదీశారు. పథకం ప్రకారం ప్రజాధనాన్ని లూటీ చేయడానికి నకిలీ కంపెనీలను సృష్టించి వాటి ద్వారా డబ్బులు మళ్లించుకున్నారని చెప్పారు. బాబు అరెస్ట్‌పై ఇంకా రాద్ధాంతం చేయడం తగదని హితవు పలికారు. ఎమ్మెల్యే వెంట దగదర్తి ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కసుమూరులో పట్టపగలు చోరీ

వెంకటాచలం : ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులుగొట్టి చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని కసుమూరులో మంగళవారం జరిగింది. కసుమూరు గ్రామానికి చెందిన వాసు తన పనుల నిమిత్తం మంగళవారం ఇంటికి తాళం వేసుకుని వెళ్లాడు. ఇదే అదునుగా గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం ఇంటికి వచ్చిన వాసు కుటుంబసభ్యులు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న 33 సవర్ల బంగారు నగలు, రూ.35 వేల నగదు చోరీకి గురైందని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

- తీవ్రగాయాలు


ఆత్మకూరు : తన పొలంలో అక్రమంగా గొర్రెలు మేపుతుండడంపై ప్రశ్నించినందుకు అతనిపై దాడికి పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలంలోని బట్టేపాడు పొలాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై బి.రాజేష్ వివరాల మేరకు.. బట్టేపాడు గ్రామానికి చెందిన ఉప్పు భాస్కర్ తన మేకలను తోలుకొని యథావిధిగా పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో అతని పొలంలో కనుపూరుపల్లికి చెందిన వ్యక్తులు మేకలు, గొర్రెలు మేపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించినందుకు ఉప్పు భాస్కర్‌పై కనుపూరుపల్లికి చెందిన ఆవుల శీనయ్య, వెంకటేశ్వర్లు, రమణయ్య కలిసి కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. తల, కాళ్లకు తీవ్ర గాయాలైన భాస్కర్‌ను సమీపంలోని రైతులు ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. ఎస్సై బి.రాజేష్ కేసు నమోదు చేశారు. విచారణ చేయనున్నట్లు తెలిపారు.

గాయపడిన మహిళ మృతి


మృతిచెందిన రమణమ్మ

ఆత్మకూరు : పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ వద్ద గత వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఆత్మకూరు పోలీసుల వివరాల మేరకు.. మహిమలూరు గ్రామానికి చెందిన కుంకాల రమణమ్మ (59) ఇంటి సామగ్రి కోసం గత సోమవారం ఆత్మకూరుకు వచ్చింది. సామగ్రిని కొనుగోలు చేసి తిరిగి గ్రామానికి వెళ్లే క్రమంలో పట్టణంలోని బీఎస్సార్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో వేగంగా వస్తున్న కారు ఆమెను ఢీకొంది. దీంతో రమణమ్మ తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బంధువులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. పేద కుటుంబమైన వారు చికిత్స కోసం రూ.4.50 లక్షలు ఖర్చు చేశారు. అయినా లాభం లేకపోవడంతో ఆమెను ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.65
సన్నవి : రూ.30
పండ్లు : రూ.7

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.135
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్:	రూ.234
స్కిన్‌లెస్ చికెన్:	రూ.260
లేయర్ చికెన్:	రూ.200

అంగరంగ వైభవంగా..

పోలేరమ్మ తల్లీ పాహిమాం అంటూ ప్రణామాలు.. ఆపదను తొలగించి ఆదుకోవమ్మా అంటూ వేడుకోలు.. కరువు కాటకాలను కడతేర్చగా కదలిరావమ్మా అంటూ మడిభిక్షాలు.. పోతురాజుకు పొంగళ్లు.. వేయికళ్ల దుత్తలతో మొక్కుబడి సమర్పణలతో వెంకటగిరి జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. అట్టహాసంగా నిర్వహించిన ఘటోత్సవంతో జన జాతర ఆరంభమైంది. రాష్ట్ర పండగ హోదాకు తగ్గట్టు సంబరం అంబరాన్నంటుతోంది. విద్యుద్దీపాల వెలుగులో 'గిరి' దేదీప్యంగా విరాజిల్లుతోంది. సాంస్కృతిక కళాప్రదర్శనలతో అలరారుతోంది.


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి


అమ్మవారి ఆలయం ముందు విద్యుద్దీపాలంకరణ

- వెంకటగిరి జాతరకు సర్వం సిద్ధం
- రాష్ట్ర పండుగకు భారీ ఏర్పాట్లు
- విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతున్న పట్టణం

సైదాపురం/వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను బుధ, గురువారాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఘటోత్సవంతో సంబరాలు మొదలైనా కీలక ఘట్టాలు 4, 5వ తేదీల్లో సాగనున్నాయి. రాష్ట్ర పండగగా పోలేరమ్మ జాతరను ప్రకటించిన తర్వాత ఆ హోదాలో సకలం సిద్ధం చేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కనీవినీ ఎరుగని విధంగా సన్నాహాలు చేపట్టారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా చర్యలు తీసుకున్నారు. నిరంతరం అధికారులు, నేతలు, ప్రజా సంఘాలతో సమన్వయం చేసుకుంటూ వెంకటగిరి రాజా కుటుంబీకుల సలహాలు, సంప్రదింపులతో కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రతిరోజు నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి కటౌట్లతో పాటు విద్యుద్దీపాలతో పట్టణాన్ని శోభాయమానంగా అలంకరించారు.

నేడు క్రాకర్స్ షో

దసరా సందర్భంగా మైసూరు రాజా ప్యాలెస్‌లో నిర్వహించే క్రాకర్స్ షోను వెంకటగిరిలో ఈ ఏడాది చేపట్టనున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన బాణసంచాతో జాతరకు కొత్త వెలుగులు తీసుకురానున్నారు.

పుట్టింటి నుంచి మెట్టింటికి..

పుట్టిల్లు కుమ్మరింట్లో బుధవారం పుట్టమన్నుతో పోలేరమ్మ తల్లి ప్రతిమను తయారు చేస్తారు. కాంపాళెంలో కాలిగంల వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మెట్టినిల్లు అయిన జీనుగుల వారి వీధికి తీసుకువస్తారు. అక్కడ రజకులు చేతులమీదుగా పోలేరమ్మకు పూజలు నిర్వహించి మెట్టింటికి ఆహ్వానం పలుకుతారు. ప్రతిమకు కళ్లు, దిష్టి చుక్క పెట్టి, బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. అమ్మవారి ప్రతిమను అద్దంలో చూస్తూ కళ్లు అమర్చే ఘట్టం ఆకట్టుకుంటుంది. అనంతరం ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రథంపై పోలేరమ్మను కొలువుదీర్చి ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకువస్తారు. బుధవారం రాత్రంతా ఈ వేడుక జరుగుతుంది.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

పోలేరమ్మ ఆలయం సమీపంలో మంగళవారం రూ.500, రూ.200 టికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్‌ను నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య భక్తులు సైతం సులువుగా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది రూ.500 టికెట్‌కు 5 లడ్లు, రూ.200 టికెట్‌కు రెండు లడ్లను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఉచిత దర్శనంలో వచ్చే ప్రతి భక్తుడికి అమ్మవారి ప్రసాదం అందజేయనున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు జాతర విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.


అమ్మవారి దర్శన టికెట్‌ను కొనుగోలు చేస్తున్న నేదురుమల్లి

మడిభిక్షాలతో సందడి

జాతరలో మడిభిక్షాల సందడి ప్రత్యేకం. పోతురాజుకు పొంగలి పెట్టండి.. పగలకపోతే నా నెత్తిన కొట్టండి.. అంటూ వేపాకు నడుముకు కట్టుకుని వేయికళ్ల దుత్తలతో భక్తులు ఇంటింటా భిక్షాటన చేస్తారు.


కళాకారుడి ప్రదర్శన


అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ


క్రాస్‌రోడ్డు సెంటర్ వద్ద భారీ ఆహ్వాన ఆర్చి


యుద్ధానికి వెళ్తున్న కృష్ణార్జునుడి కటౌట్

నాయుడుపేట మున్సిపాలిటీ అప్‌గ్రేడ్‌పై తీర్మానం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నాలుగు గ్రామ పంచాయతీలు వీలినం కావడం, అదేవిధంగా ఆదాయ వనరులు పెరగడంతో ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అర్హత కలిగి ఉన్నామని, దీనిపై ప్రభుత్వానికి నివేదించేందుకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానిస్తూ ఆమోదం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ ఐ.శ్రీనివాసరావు కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలో రూపొందించిన 23 అంశాలను చదివి వివరించారు. వివిధ అభివృద్ధి పనులపై చర్చించి కౌన్సిల్ ఆమోదం కోరారు. మున్సిపల్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షాజహాన్, వైస్ చైర్మన్ జె.వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు డి.రవి, పి.చంద్రారెడ్డి, సీహెచ్ కుమార్, కె.రామకృష్ణంరాజు, అశోక్‌కుమార్, షేక్ షబ్బీర్, కె.వరలక్ష్మి, విజయలక్ష్మి, ఎస్.శాంతి, ఎం.నీరజ, కె.సుమ పాల్గొన్నారు.

అందరి పిల్లల్లా అల్లరి చేస్తూ ఆడుకోవాల్సిన ఆ చిన్నారికి పెద్దకష్టం వచ్చింది. అనుకోని రోడ్డు ప్రమాదం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇప్పటికే రూ.లక్షలు ఖర్చు చేసిన చిన్నారి తల్లిదండ్రులకు మరింత సాయం అవసరం కావడంతో వారు దాతల సాయం కోరుతున్నారు.


చిన్నారి బిందుశ్రీ

చిన్నారికి పెద్ద కష్టం

- ఆపరేషన్‌కు రూ.లక్షల్లో ఖర్చు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి గ్రామానికి చెందిన రమేష్, రత్నమ్మ దంపతులకు మూడేళ్ల బిందుశ్రీ కుమార్తె సంతానం. కాగా వీరు నెల రోజుల క్రితం వైఎస్సార్ జిల్లా మైదుకూరు వద్ద వ్యక్తిగత పనులపై వెళ్లినప్పుడు ఆటోలో ప్రయాణిస్తుండగా రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తల్లిదండ్రులకు స్వల్పగాయాలు కాగా బిందుశ్రీకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం చెన్నై అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. కాగా చిన్నారికి మెదడుకు సంబంధించి రక్తనాళాలు చిట్లిపోయాయని, ఆపరేషన్ చేయాలని సూచించారు. నిరుపేదలైన తల్లిదండ్రులు తెలిసిన వారి వద్ద అప్పుచేసి రూ.20 లక్షలకుపైగా చిన్నారి వైద్యం కోసం ఖర్చు చేశారు. అయినప్పటికీ మరో రూ.12 లక్షలు చిన్నారి శస్త్రచికిత్సకు అవసరమని, దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.


చెన్నై అపోలో చికిత్స పొందుతున్న చిన్నారి బిందుశ్రీ

సాయం చేయాలనుకుంటే
సంప్రదించాల్సిన నంబర్ – 70956 56091